
క్లుప్తంగా

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వన్నాల



కంకిపాడు: లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు నూతన అధ్యక్షుడిగా వన్నాల శివరామకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ నూతన పాలక వర్గ ప్రమాణస్వీకార మహోత్సవం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడుగా వన్నాల శివరామకృష్ణ, కార్యదర్శిగా మద్దుల యుగంధర్, కోశాధికారిగా నల్లజేరు నీహార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మల్టిపుల్ చైర్‌పర్సన్‌గా డి.శ్రీశాంతి, పూర్వ గవర్నర్‌లు ఎల్.శివశంకర్, మిరియాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వేములపల్లి లక్ష్మణ్‌చౌదరి హాజరై లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బండి జ్యోతి, బండి నాంచారయ్య, ఎం.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వీఎన్ పురం కాలనీలో కలుషిత నీరు సరఫరా



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో గ్రామపంచాయతీ సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతుంది. డ్రెయిన్ల కింద ఉన్న పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీటిలో మురుగునీరు కలుస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. దీనివల్ల కుళాయిల్లో దుర్వాసనతో కూడిన నురగలు కక్కుతున్న నలుపు రంగులో నీరు వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి పైపులైన్ లీకేజీల అరికట్టేందుకు తక్షణ మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. లేకపోతే డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ సీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సెక్షన్ పరిధిలోని శేరినరసన్నపాలెం, కె.సీతారామపురం ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

రైల్వే కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈ ఏడాది మే 5న విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందిన రైల్వే కార్మికుని కుటుంబానికి రైల్వే మజ్దూర్ యూనియన్ ఆర్థిక సాయం అందజేసింది. ఈమేరకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్, విజయవాడ డివిజన్‌ల కార్యదర్శులు పి.రవీందర్, లీల బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తూ చిన్న వయస్సులోనే రైలు ప్రమాదంలో మృతిచెందటం దురదృష్టకమన్నారు. పేద కుటుంబంలో జన్మించి రైల్వే ఉద్యోగం పొందిన స్వల్ప కాలంలోనే మృత్యువాత పడటం అతని కుటుంబానికి ఎంతో శోకాన్ని మిగిల్చిందన్నారు. రైల్వేశాఖ తరపున మృతుని కుటుంబానికి రావాల్సిన నష్టపరిహారం, ఉద్యోగం కోసం దక్షిణ మధ్య రైల్వే జీఎం, డీఆర్ఎంలను సంప్రదించి వారికి న్యాయం చేసేందుకు కృషిచేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, సంపత్ కుమార్, వెంకట్, రాజేందర్, అంజి యాదవ్ పాల్గొన్నారు.

రేపు పూజా సామగ్రి విక్రయ దుకాణం లైసెన్స్‌కు వేలం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో పూజా సామగ్రి విక్రయ దుకాణం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే లైసెన్స్‌కు ఈ నెల 19వ తేదీన సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రెండేళ్ల పాటు ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి విక్రయం, కొబ్బరి చిప్పల లైసెన్స్‌కు ఆసక్తి గల వ్యక్తులు వేలంలో పాల్గొనాలన్నారు. రూ.60 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన చెప్పారు. 19వ తేదీ ఉదయం 11.30 గంటలకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందని చెప్పారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు



పురుషోత్తపట్నంలో ఆంజనేయస్వామి



చినకంచిలో శ్రీవెంకటేశ్వరస్వామి



విశేష అలంకారంలో శ్రీసీతారామచంద్రస్వామి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- భక్తులతో పోటెత్తిన దేవాలయాలు



నున్న గ్రామం చినకంచిలో పారాయణం చేస్తున్న వేద పండితులు

కంకిపాడు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. బుధవారం తొలి ఏకాదశి కావటంతో ఉదయాన్నే స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పండుగ సందర్భంగా పేలాల పిండి తయారుచేసుకుని ఇంటిల్లిపాది భుజించి సంప్రదాయబద్ధంగా వేడుక జరుపుకున్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

దావాజిగూడెంలో..

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వేం చేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపారు. స్వామివారికి 58 లీటర్ల గోక్షీరం, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులచే విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీరామ రక్షాస్తోత్రం, భగవద్గీత పారాయణం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు తొలి ఏకాదశి సందర్భంగా పేలాల పిండి ప్రసాదాన్ని వితరణ చేశారు.

చినకంచిలో పూజలు

నున్న(విజయవాడరూరల్): చినకంచిలో శ్రీఅష్టలక్ష్మి సమేత సహిత ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి విశేష అలంకరణ సహస్రనామార్చన విశేష పూజలు నిర్వహించారు. వేదపాఠశాల విద్యార్థులు స్వామి వారి సన్నిధిలో పారాయణం చేశారు. అనంతరం మహావిష్ణుకి అత్యంత ఇష్టమైన పేలాల పిండిని ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని అన్ని విష్ణు ఆలయాల్లో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలు గ్రామాల్లో పూజలు

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇష్ట దైవాలను దర్శించారు. పురుషోత్తపట్నం అభయాంజనేయ స్వామి దేవాలయంలో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేసి విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పఠించారు. సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద అర్చకులు కొండవీటి హరిశ్చంద్ర ప్రసాద్ తొలి ఏకాదశి విశిష్టతను వివరించారు.

పెనమలూరు రహదారి గుంతలమయం

- తరచుగా ప్రమాదాలు
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు



పెనమలూరు ప్రధాన రహదారి దుస్థితి

పెనమలూరు: నియోజకవర్గ కేంద్రం పెనమలూరు గ్రామ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. పెనమలూరు వంతెన నుంచి అంబేడ్కర్ నగర్ వరకు గ్రామంలో ఈ రహదారి ఉంది. అయితే రోడ్డు అడుగడుగునా గుంతలు పడి నడవటానికి కూడా వీలు లేకుండా ఉంది. పెనమలూరు వంతెన వద్ద నుంచి పెనమలూరు గ్రామ సరిహద్దులు ఉన్నాయి. గ్రామంలో ప్రధాన రహదారి ఆర్అండ్‌బీ పరిధిలో ఉంది. పెనమలూరు సెంటర్ నుంచి పెనమలూరు, చోడవరం గ్రామాల మీదగా కరకట్ట వరకు రోడ్డు దాదాపు 7 కిలోమీటర్ల మేర ఉంది. పెనమలూరు గ్రామంలోనే దాదాపు 3 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరించి ఉంది. పెనమలూరు, చోడవరానికి ప్రతి రోజూ సిటీ బస్సులు దాదాపు 70 ట్రిప్పుల వరకు తిరుగుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు నిత్యం రాకపోకలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది.

వాహనదారుల ఆందోళన

పెనమలూరులో ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. పెనమలూరు వంతెన డౌన్, పెద్ద గుడి, బ్యాంకు వద్ద, హైస్కూల్, జెండా చెట్టు ప్రాంతాల్లో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రహదారిపై తారు మాయమై, మట్టి రోడ్డుగా మారి గుంతలు దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీలు లేక పోవటంతో రోడ్డు పైకి మురుగునీరు చేరుతుంది. వర్షం చినుకుపడితే రోడ్డు పైనే మురుగునీరు పారుతోంది. రోడ్డు గుంతల మయంగా అధ్వానంగా మారటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన డౌన్, పెద్ద గుడి, జెండా చెట్టు ప్రాంతాల్లో మలుపు వద్ద గుంతలు తప్పించపోయి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అసలే రోడ్డుపై గుంతలు ఉండగా దీనికి తోడు ఎగుడుదిగుడుగా స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. పెనమలూరు ప్రధాన రహదారిని వెంటనే నిర్మించి ప్రమాదాలు నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..

నిత్యం ట్రాఫిక్‌తో ఉండే పెనమలూరు రోడ్డు పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజల సమస్యలు గుర్తించి గతంలో మరమ్మతులు చేయించా. రోడ్డు గుంతలు పడి సమస్యగా మారినందున వెంటనే కొత్త రోడ్డు వేయాలి.

– లింగాల భాస్కరరావు, సర్పంచ్, పెనమలూరు

అరటి ఉత్పత్తులతో బహుళ ప్రయోజనాలు



సూరంపల్లి ఎలీప్‌లో శిక్షణ పొందిన వారితో చైర్‌పర్సన్ కనకదుర్గ

గన్నవరం రూరల్: అరటి ఉత్పత్తులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎలీప్(అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా) చైర్‌పర్సన్ కె.కనకదుర్గ చెప్పారు. సూరంపల్లి మహిళా పారిశ్రామిక వాడలో అరటి ఆహార ఉత్పత్తులపై వారం రోజుల పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. అరటిపండు, కాయ, నార, ఆకులు అన్ని ఉపయోగపడతాయని చెప్పారు. ఆహార ఉత్పత్తులుగా ఉండే వీటన్నింటిని ఉపయోగించి లాభసాటిగా పరిశ్రమను నడుపుకోవాలన్నారు. మార్కెట్ చేసుకోవాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమలు ఎంతో ఆర్థిక వృద్ధిని సాధిస్తాయని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న 37 మందికి ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. రీజినల్ మేనేజర్ వి.సునీత, ఎలీప్ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



ఉయ్యూరులో ఆషాఢ సారె సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



పెదపులిపాకలో సారె తీసుకువస్తున్న మహిళలు



ఆత్కూరులో సారె సమర్పిస్తున్న భక్తులు

పెనమలూరు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని పలు ఆలయాల్లో భక్తులు బుధవారం అమ్మవార్లకు ఆషాఢ మాస సారెలను సమర్పించారు. పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, సారె అందజేశారు. శ్రీరామలింగేశ్వరనగర్, గురునానక్‌నగర్ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అమ్మవారికి పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్కూరులో మేస్త్రి బుజ్జి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ఆషాఢ సారెను అంగరంగ వైభవంగా తీసుకుని వెళ్లి గ్రామంలోని కనకదుర్గాదేవికి సమర్పించారు. పండితులు మౌళి కుమార్ శాస్త్రి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆర్నెపల్లి సింహాచలం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరమ్మ తల్లికి సారె సమర్పణ

ఉయ్యూరు: ఆషాఢ మాసం, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన భక్తులు ఉయ్యూరులో వేం చేసి ఉన్న శ్రీ వీరమ్మతల్లి అమ్మవారికి బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో జై వీరమ్మ, జైజై వీరమ్మ అంటూ స్మరిస్తూ పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రావిచెట్టు సెంటర్‌లోని అమ్మవారి మెట్టినింటికి వెళ్లి సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక మొహర్రం



హనుమాన్‌జంక్షన్ రూరల్: త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక మొహర్రం అని పలువురు ముస్లిం మత గురువులు చెప్పారు. బాపులపాడు మండలంలో పలు గ్రామాల్లో ముస్లింలు మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తు చేసుకోవటమే మొహర్రం ప్రత్యేకత అని చెప్పారు. హనుమాన్‌జంక్షన్‌లో ముస్లింలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తూ, గుర్రాలతో ప్రదర్శన చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కంకిపాడు: మొహర్రంను ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఈడుపుగల్లు జెండా ప్రాంతంలో పీర్లు ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లు చేతబట్టి గ్రామోత్సవం జరిపారు. పీర్లు ఊరేగింపులో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న జెండా చెట్టుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని జేకే గోజురియో కరాటే అకాడమీ సత్యనారాయణపురం బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులకు సంస్థ ప్రధాన కార్యాలయంలో బెల్ట్ ప్రమోషన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎల్లో బెల్ట్ నుంచి దశలవారీగా బ్లాక్ బెల్ట్ వరకు ప్రమోట్ అయిన విద్యార్థులకు సత్యనారాయణపురం బ్రాంచ్ హెడ్ కోచ్ పీవీకెఎస్ హర్ష బుధవారం ఆయా బెల్ట్‌లతోపాటు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దారుఢ్యం, ఆత్మరక్షణకు కరాటే విద్య దోహద పడుతుందన్నారు. కరాటేలో వివిధ రకాల బెల్టులు పొందిన విద్యార్థులు మరింత శిక్షణ తీసుకుని వారి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. పలు రకాల బెల్టులను అందుకున్న విద్యార్థులను అకాడమీ వ్యవస్థాపకుడు జె.శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్, ట్రెజరర్ సీహెచ్ మహేష్‌బాబు అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్థికపరమైన ఇబ్బందులను తట్టుకోలేక ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కనకదుర్గనగర్‌లో నివాసం ఉంటున్న గరిమెళ్ల సాయి గన్నవరం మండలం ముస్తాబాదలో ఒక ఫెర్టిలైజర్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అప్పుల భారం ఎక్కువై ఒత్తిడి పెరగటంతో సాయి గన్నవరంలోని ఒక ఫెర్టిలైజర్ షాపులో పురుగుల మందు కొనుగోలు చేసి ముస్తాబాదలోని తన పొలంలోకి వెళ్లి తాగాడు. ఇది చూసిన స్థానికులు కొందరు అతన్ని హుటాహుటిన కరెన్సీనగర్‌లోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌కు తరలించారు. విషయం తెలిసిన పటమట పోలీసులు ఆస్పత్రికి వెళ్లి విచారించారు. సాయి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

శాకంబరీ ఉత్సవాలకు కూరగాయల వితరణ



కూరగాయల లోడు వాహనానికి జెండా ఊపుతున్న రైతులు


ఉయ్యూరు: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేం చేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి శాకంబరీ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణ నిమిత్తం చిన ఓగిరాల గ్రామానికి చెందిన రైతులు రూ.55 వేల విలువైన కూరగాయలను వితరణగా ఇచ్చారు. కూరగాయల లోడుతో కూడిన వాహనాన్ని బుధవారం విజయవాడకు తరలించారు. మరీదు శివశంకర్‌రావు, దోనేపూడి శివాజీ, దోనేపూడి వెంకటేశ్వరరావు, బొమ్మారెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



శాకంబరీగా విజయరాజరాజేశ్వరి అమ్మవారు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి, శ్రీ విజయసుందరేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం అమ్మవారిని కూరగాయలతో శాకంబరీగా అలంకరణ చేశారు. భక్తులు వివిధ రకాల కూరగాయలు తీసుకు వచ్చి అమ్మవారిని ప్రత్యేకంగా శాకంబరీదేవిగా అలంకరించారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గణేష్ బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యువైఎఫ్ఐ) రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్ బాబు డిమాండ్ చేశారు. విజయవాడ వించిపేటలోని సంఘ కార్యాలయంలో సంస్థ నగర కన్వీనర్ అనకాపల్లి కనకరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతను నిర్లక్ష్యం చేయడం తగదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వ్యవసాయ రంగ అనుబంధ పరిశ్రమలు, పశువుల పెంపకం, పౌల్ట్రీ, డెయిరీ, చెరకు, చేపలు, రొయ్యల చెరువులు, పండ్ల తోటలు, పేపర్ మిల్లులలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు.

నగరంలో విరాజి చిత్ర బృందం సందడి

పటమట(విజయవాడతూర్పు): సినీ హీరో వరుణ్ సందేశ్ నటించిన విరాజి చిత్ర బృందం బుధవారం నగరంలో సందడి చేసింది. తన 17 ఏళ్ల సినీ కెరియర్‌లో ఇప్పటివరకు చేయని ఒక వినూత్నమైన సినిమా విరాజి చిత్రమని, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని హీరో వరుణ్ సందేశ్ కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా నగరంలోని ఓ హోటల్లో చిత్ర యూనిట్ విలేకరులతో మాట్లాడింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ఒక డిఫరెంట్ కథతో డిఫరెంట్ లుక్‌తో ఆగస్టు రెండున విరాజి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చెప్పారు. విజయవాడ నగరం నుంచి చిత్ర ప్రమోషన్ ప్రారంభించామని, ఇప్పటివరకు ఏ హీరో చేయని మాదిరిగా విరాజీ చిత్రంలో తాను నటించిన క్యారెక్టర్‌ను ప్రేక్షకులకు తెలియజేసేందుకు అదే గెటప్పుతో ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. దర్శకుడు హర్షకు ఈ చిత్రం మొదటి చిత్రం అయినా కూడా ఒక సీనియర్ దర్శకుడి మాదిరిగా చిత్రాన్ని అద్భుతంగా తీశారని వివరించారు. ఈ చిత్రంలో హీరోయిన్ ఉండదని కేవలం నటీనటులు మాత్రమే ఉంటారని చెప్పారు. ఆగస్టు రెండున తమ చిత్రం విడుదల కానుందని, తెలుగు రాష్ట్రాల ప్రజలు తమ చిత్రాన్ని వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నటీమణులు అపర్ణాదేవి, కుషాలిని మాట్లాడుతూ విరాజీ చిత్రంలో తమ క్యారెక్టర్లు మహిళా ప్రేక్షకులకు నచ్చుతాయని తెలిపారు. తదనంతరం చిత్ర నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మాట్లాడారు.

21న వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పి.మురళీకృష్ణ తదితరులు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): తెలుగు రాష్ట్రాలలో సమాజాన్ని పురోగమనం వైపు నడిపించేందుకు కృషి చేసిన వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో జరుగుతుందని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ తెలిపారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగునాట 1650, 1700 సంవత్సరాల నాటి నుంచే అభ్యుదయ భావాలు పూరించిన పోతులూరి వీరబ్రహ్మం, ప్రజాకవి వేమన, కందుకూరి, గురజాడ, గిడుగు రామ్మూర్తి, గుడిపాటి వెంకటాచలం, కుసుమ ధర్మన్న, మగ్దూం మోహిద్దిన్, శ్రీశ్రీ, బండారు అచ్చమాంబ, దాశరథి కృష్ణమాచార్య లాంటి 32 మంది మహోన్నతుల చిత్రపటాలు ఆవిష్కరిస్తారన్నారు. సాహితీవేత్తలు రచయితలు, కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రేమికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రముఖ రచయిత్రి మందరపు హైమావతి, ప్రముఖ చిత్రకారులు అరసవిల్లి గిరిధర్, క్రాంతి కిరణ్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణ, జేఎంఎస్ వ్యవస్థాపకుడు జె.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.